# యూనిట్ 4 13. ఒక నది ఆత్మకథ

**చిత్రం చూడండి - ఆలోచించండి - మాట్లాడండి**



★ చిత్రం చూడండి. చిత్రంలో ఏమేమి కనిపిస్తున్నాయి?

★ నదినీరు కలుషితమైతే వచ్చే నష్టాలేవి?

★ నదులు కలుషితం కాకుండా ఉండడానికి మనం ఏం చెయ్యాలి?

**పిల్లలకు సూచనలు :**

★ పాఠంలోని చిత్రాలను చూడండి. చిత్రాలను గురించి మాట్లాడండి.

★ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద గీత గీయండి.

★ గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడిగి లేదా పదాలు - అర్థాలు అన్న పట్టికలో చూసి తెలుసుకోండి.

చూస్తే కనిపిస్తాను
దారి ఇస్తే పరుగులు తీస్తాను
పట్టుకుంటే జారిపోతాను
పట్టుపడితే కట్టుబడతాను.
ఉన్నప్పుడు నేనంటే అందరికీ అలుసే,
కాని లేనప్పుడు అందరూ



నాకోసం అల్లాడిపోతారు. నాపేరు
గోడలో ఉంది; దాపులో ఉంది.
వరసలో ముందే ఉంది;
దారిలో వెనకబడింది;
మరి చెప్పుకోండి చూద్దాం, నేనెవరినో.... కష్టంగా ఉందా?

పోనీ, నేనే చెబుతాను — మీ గోదావరిని. మీకు తెలుసు, నా పేరు. నన్ను గురించిన సమాచారమూ విశేషాలూ పుస్తకాల్లో, పత్రికల్లో మీరు చాలాసార్లు చదివి ఉంటారు; టీ.వీ.లలో, సినిమాలలో చూసే ఉంటారు.

నేను మహారాష్ట్రలోని త్ర్యంబకేశ్వరం సమీపంలోని పడమటి కనుమల్లోని బ్రహ్మగిరి కొండల్లో పుట్టాను. అక్కడినుంచి తూర్పుదిశగా 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తాను. మార్గమధ్యంలో మిమ్మల్నందరినీ కలుసుకొనే అవకాశం ఇలా కలిగింది నాకు. వేలాది సంవత్సరాలుగా స్వచ్ఛంగా, పవిత్రంగా సాగుతున్న నా మనుగడకు కాలుష్యం ఒక ప్రమాదంగా తయారైంది, ఇప్పుడు.

పరిశ్రమల వ్యర్థపదార్థాలు, పురుగుల మందులు, రసాయనిక ఎరువులు తదితర పదార్థాలవల్ల నేను మురికిదాన్ని అయిపోతున్నాను. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, పైఠణ్ మొదలైన పట్టణాల మురికితోపాటు ఆంధ్రప్రదేశంలోని వందలాది పరిశ్రమల వ్యర్థపదార్థాలు చిన్న చిన్న నదులద్వారా, కాలువల ద్వారా వచ్చి నాలో కలిసిపోతున్నాయి. వివిధ ప్రాంతాలలోని పరిశ్రమల వ్యర్థపదార్థాలు, రసాయనాలూ, పట్టణాల, పంటపొలాల మురుగునీరూ నాలో చేరడంవల్ల నేను నిలువెల్లా కలుషితమై పోతున్నాను. పంటలకోసం వినియోగించే పురుగుమందుల, రసాయనిక ఎరువుల అవశేషాలు కూడా నాలోనే కలుస్తున్నాయి. హైదరాబాదు, సికింద్రాబాదు, పటన్‌చెరువు పారిశ్రామిక వాడల్లో వందకు పైగా పరిశ్రమల వ్యర్థపదార్థాలు నక్కవాగులో కలుస్తున్నాయి. నక్కవాగు మంజీరానదిలో కలుస్తుంది.


© SCERT not to be republished

మంజీర నాలో కలవడంవల్ల నేను తీవ్రంగా కలుషితమవుతున్నాను. ఈ కారణాలవల్ల నా స్వచ్ఛతకూ, పవిత్రతకూ భంగం కలుగుతూంది. నా నీళ్ళు తాగడంవల్ల పశువులు, మనుషులూ అనారోగ్యం పాలవుతారని నేను కలత చెందుతున్నాను. నా నీటిలో పెరిగిన గడ్డి తిన్న పశువుల పాలుకూడా కలుషితం అవుతున్నందుకు నాకు దుఃఖం కలుగుతూంది. నా జలాలలో స్నానంచేయడం పవిత్రంగా భావించే భక్తులు కూడా ఈ కాలుష్యం బారిన పడుతున్నారు. ఎంతో పేరుపొందిన 'పొలస' చేపలకూ ఈ కాలుష్యం బెడద సోకింది. ప్రతి ఏటా శ్రావణమాసంలో సముద్రంనుంచి నా ప్రవాహంలోకి ఎదురు ఈదుతూ వచ్చి ధవళేశ్వరం ఆనకట్ట దిగువకు చేరుకొనే 'పొలస' చేపలను మాంసాహారప్రియులు అధిక ధర చెల్లించి కొంటారు. అలాంటి పొలస చేపలకూ కాలుష్యం సోకడంతో వాటి సంఖ్య తగ్గుతూందని పాపం జాలరులు ఆందోళన చెందుతున్నారు. ఒక పొలస చేపలే కాదు, అనేక జలచరాలకు కూడా ఈ బాధ తప్పడం లేదు. కొందరు పర్యటకులు తాము వినియోగించిన ప్లాస్టిక్ సీసాలూ గ్లాసులూ కవర్లూ నాలోకి విసిరేస్తూ ఉండటంవల్ల కూడా నేను మరింత మురికిగా అవుతున్నాను. జంతువుల కళేబరాలను నాలో పడేయడం, మనుషులు కాలకృత్యాలు తీర్చుకోడం లాంటి కారణాలు మీకు తెలిసినవే!

పిల్లలూ...! ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో బాధలున్నాయి. ఆ బాధల్ని అలా కాసేపు మరిచిపోయి నాగురించి మీరు తెలుసుకోవాల్సిన విశేషాలూ వివరాలూ కూడా చెబుతాను వినండి.

**'త్ర్యంబకేశ్వరం'**లో పుట్టిన నేను నాసిక్, ఔరంగాబాద్, పైఠణ్, నాందేడ్ పట్టణాల ప్రజలను పలకరిస్తూ నిజామాబాద్ జిల్లాలోని **'కందకుర్తి'** అనే గ్రామందగ్గర ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాను. నా ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంచిర్యాల, గోదావరిఖని, మణుగూరు, కొవ్వూరు, రాజమండ్రి పట్టణాలున్నాయి. బాసర, ధర్మపురి, మంథిని, కాళేశ్వరం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలు నా ఒడ్డున వెలిశాయి. మహారాష్ట్రలోని జయక్‌వాడి, బాబ్లి, ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీరాంసాగర్, ధవళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాను. సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ధవళేశ్వరందగ్గర నాకు ఆనకట్ట కట్టాడు; ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా మార్చాడు. ధవళేశ్వరంలో నా ఒడ్డున కాటన్ మ్యూజియం ఉంది. నేను వెళ్ళే దారిలో పాపికొండలు, పట్టిసీమ, కోనసీమ ప్రాంతాలు పర్యటకులను అలరిస్తున్నాయి. గోదావరీ నదిలో పడవప్రయాణాన్ని ప్రయాణికులెప్పుడూ మరిచిపోలేరు. నాగురించి కవులూ రచయితలూ ఎన్నో కావ్యాలూ నవలలూ కథలూ రాశారు. నా పేరుతో సినిమాలు కూడా వచ్చాయి. సినిమా షూటింగులకు కూడా నన్ను వినియోగించుకుంటూ ఉంటారు. అందరికీ అన్ని వేళలా ఉపయోగపడుతూ ఉండాలనేది నా ఆకాంక్ష!




నన్ను కాపాడుకోడం భావిపౌరులుగా మీ బాధ్యత అని మరిచిపోకండి! ఉంటాను.... పిల్లలూ... బై.. బై...


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ
© SCERT not to be republished



# ఇవి చేయండి



## I వినండి - ఆలోచించి చెప్పండి



(అ) గోదావరి నది గురించి సొంతమాటల్లో చెప్పండి.

(ఆ) మీ ప్రాంతంలో ప్రవహించే వాగులను, నదులను గురించి చెప్పండి. నదులలోకి నీరు ఎక్కడినుంచి వస్తుంది?

(ఇ) నది తనను గురించి చెప్పింది కదా! మీరు మీగురించి చెప్పండి.

(ఈ) నది తన బాధల గురించి ఏమేమి చెప్పింది? దానికి కారణమెవరు?

## II చదవండి - అర్థంచేసుకొని చెప్పండి - రాయండి



(అ) కింది పాట చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

ఉప్పొంగి పోయింది గోదావరి తాను
తెప్పున్న ఎగసింది గోదావరి
కొండల్లొ ఉరికింది కోనల్లు నిండింది
ఆకాశగంగతో హస్తాలు కలిపింది ॥ఉప్పొంగి॥

అడవి చెట్లన్నిటిని జడలోన తురిమింది
ఊళ్ళు దండలు గుచ్చి మెళ్ళోన తాల్చింది ॥ఉప్పొంగి॥

వడులతో, సుడులతో, గరువాల నడలతో
పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తు వచ్చింది ॥ఉప్పొంగి॥

1. గోదావరి ఎలా ఉరికింది?
2. గోదావరి నడకలు ఎలా ఉన్నాయి?
3. గోదావరి ఎవరితో చేతులు కలిపింది?
4. గోదావరి మెడలో ఏం వేసుకుంది?

(ఆ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. పాఠం ప్రారంభంలోని వాక్యాలు చదవండి. “గోదావరి” గురించిన పొడుపు కథలో అది ఎక్కడ ఉందో గుర్తించండి.
2. గోదావరీనది పుట్టుపూర్వోత్తరాలను తెలపండి.
3. గోదావరీనది ఎందుకు బాధపడింది? ఏమని బాధపడింది?

©SCERT not to be republished

## III రాయండి




(అ) నదిలో రకరకాల జీవరాశులు ఉంటాయి. వాటిమీద ఆధారపడి ఎంతోమంది బతుకుతున్నారు. నదులమీద ఆధారపడి ఎవరెవరు బతుకుతున్నారో ఆలోచించి రాయండి.

(ఆ) గోదావరీనదిని గురించి మీ సొంతమాటల్లో రాయండి.

(ఇ) నదులలోని నీటివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ నీరు కాలుష్యానికి గురౌతున్నది. ఇలా జరగకుండా ఉండాలంటే మనం ఏంచేయాలో ఆలోచించి రాయండి.

## IV పదజాలం



(అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

కాలుష్యం : ..........................................................................

విషాదం : ..........................................................................

వ్యర్థపదార్థాలు : ..........................................................................

నదులు : ..........................................................................

(ఆ) కింది గళ్ళలోని నదులను గుర్తించండి, రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| న్నా | త్ర | పు | హ్మ | బ్ర | .................................... |
| పె | గో | దా | వ | రి | .................................... |
| కృ | న | ము | య | తుం | .................................... |
| ష్ణా | మూ | సీ | కా | గ | .................................... |
| న | ధు | సిం | వే | భ | .................................... |
| ది | గం | గ | రి | ద్ర | .................................... |

## V సృజనాత్మకత



అ) నది తనగురించి తాను చెప్పుకున్నది కదా! ఇలా చెప్పుకోడాన్ని ఆత్మకథ అంటారు. అలా మీరు మీ ఊరిలో ఉన్న నది లేదా కాలువ లేదా బావి లేదా ఏదైనా ఒకదాని ఆత్మకథను రాయండి.


ఆ) నదిలో నిండుగా నీళ్ళు కనిపించి కళకళలాడుతూ ఉంటే మీకెలా అనిపిస్తుందో వర్ణించి రాయండి.

© SCERT not to be republished



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## VI ప్రశంస / ప్రాజెక్టు పనులు



**(అ) నదికి సంబంధించిన పాటలు, పద్యాలు, కథలు మొదలయినవి సేకరించండి. వాటిని రాసి ప్రదర్శించండి. చదివి వినిపించండి.**

## VII భాషను గురించి తెలుసుకుందాం



**(అ) కింది వాక్యాలు చదవండి. గీత గీసిన అక్షరాలను గమనించండి.**

వనజ తన పుస్తకం ఇమ్మని రజనిని అడిగింది.

పాట బాగా పాడావని రంగడిని అందరూ మెచ్చుకున్నారు.

ఆనంద్, రాజును ఆడుకోడానికి పిలిచాడు.

పై వాక్యాలలో పదంచివరి అక్షరానికి (ి) వచ్చినప్పుడు 'ని' అనే విభక్తి ప్రత్యయం వచ్చింది. అట్లాగే అక్షరానికి చివర ( ు ) వచ్చినప్పుడు 'ను' అనే విభక్తి ప్రత్యయం వచ్చింది.

**కింది వాక్యాలలో 'ని', 'ను'లను సరైన చోట ఉంచండి.**

1. జాన్సన్, గోపీ ..... పెన్ను కావాలని అడిగాడు.
2. సినిమాకి వెళ్దామని మామయ్య సీత ..... పిలిచాడు.
3. అర్థంకాని విషయాల గురించి ఉపాధ్యాయురాలి .... అడిగి తెలుసుకోవాలి.
4. ఈ అడ్రసు గురించి ఎవరి .... అడిగి తెలుసుకోవాలి?

**(ఆ) కింది ఖాళీలను సరైన విభక్తులతో పూరించండి.**

1. తోట ...... అందమైన చెట్లు ఉన్నాయి.
2. కృష్ణానది మన రాష్ట్రాని ...... సంబంధించిన నది.
3. సుహాసిని ...... లక్ష్మి విశాఖపట్నం వెళ్ళింది.
4. బషీర్ ...... తాతయ్య జూకు తీసుకెళ్ళాడు.
5. ఆగష్టు 15వ తేదీన గాంధీజీ ...... ఫాతిమా ఉపన్యసించింది.



### నేనివి చేయగలనా ?



| | | |
|---|---|---|
| 1. | పాఠంలో నది ఆత్మకథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | గోదావరి ఆత్మకథను ధారాళంగా చదవగలను. | ఔను/కాదు |
| 3. | గోదావరిని గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | కాలువ / బావి గురించి ఆత్మకథ రాయగలను. | ఔను/కాదు |

© SCERT not to be republished